


షణ్ముఖ SHANMUKHAVELUGU

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు

తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152




సంపుటి : 03 సంచిక : 152

మంగళవారం 09 జూన్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.


## సమాజానికి సిగరెట్ కంటే వైసీపీ హానికరం

అధికారం కోసం జగన్ ఎన్ని అడ్డదార్లు తొక్కేందుకైనా సిద్ధపడతారన్న కేశవ్

గొడ్డలి పార్టీ నెవర్ అగైన్, కూటమి అగైన్ అండ్ అగైన్ అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు

పార్టీలో గ్రూపులు కడితే పతనం తప్పదని శ్రేణులకు హెచ్చరిక




(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 08)

ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వైసీపీ అధినేత జగన్ లక్ష్యంగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నంద్యాల జిల్లా పర్యటనలో భాగంగా మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. వైసీపీ అధినేత జగన్ ప్రజాస్వామ్యవాది కాదని, అధికారం కోసం ఎన్ని అడ్డదార్లయినా తొక్కేందుకు సిద్ధపడతారని మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడూ లీగల్ లైన్ దాటి అధికారాన్ని ఉపయోగించరని.. కానీ జగన్ మాత్రం ప్రతిరోజూ లైన్ దాటుతుంటారని ఆరోపించారు. "సిగరెట్ తాగడం ఆరోగ్యంపై ఎంత ప్రభావం చూపుతుందో.. సమాజానికి వైసీపీ అంతకంటే హానికరం" అని వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌లో మళ్లీ జగన్ అరాచక పాలన రాకూడదంటే.. 'గొడ్డలి పార్టీ నెవర్ అగైన్, కూటమి అగైన్ అండ్ అగైన్' అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రజలు ఇచ్చిన 93 శాతం స్ట్రైక్ రేటుతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకుందని గుర్తుచేశారు. పోలింగ్ బూత్ స్థాయిలో వెనకడుగు వేయకుండా నిలబడిన కార్యకర్తల శ్రమ, ధైర్యమే ఈ చారిత్రాత్మక విజయానికి కారణ మన్నారు. కార్యకర్తల త్యాగాలను మరిచిపోతే ఏ రాజకీయ పార్టీ కూడా మనుగడ సాగించలేదని.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలను గెలిపించు కోవడానికి నేతలంతా కష్టపడాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు.పార్టీలో గ్రూపు రాజకీయాలు కడితే పతనం తప్పదని నేతలను, ▶మిగతా 2లో

# కుప్పంలో కీలక మార్పులు..

## ఇకపై అన్నీ తానేనన్న సీఎం చంద్రబాబు!



కుప్పం టీడీపీ ఇంఛార్జి బాధ్యతల నుంచి కంచర్ల శ్రీకాంత్‌కు తొలగింపు

నియోజకవర్గ వ్యవహారాలు తానే చూసుకుంటానని ప్రకటించిన సీఎం చంద్రబాబు

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

కంచర్ల శ్రీకాంత్ సేవలను రాష్ట్ర స్థాయిలో వినియోగించుకోవాలని నిర్ణయం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 08)

సీఎం చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గమైన చిత్తూరు జిల్లా కుప్పంలో కీలక మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటివరకు కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జిగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇకపై కుప్పం నియోజకవర్గ వ్యవహారాలన్నీ తానే స్వయంగా చూసుకుంటానని పార్టీ నేతలకు స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో నియోజకవర్గ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు మొదలయ్యాయి. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కుప్పం నియోజకవర్గ 2

## పరీక్షలంటే తెలియని వారు కూడా బురద జల్లుతున్నారు

పశ్చిమగోదావరి జిల్లాలో

'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమం

హాజరైన సీఎం చంద్రబాబు




(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 08)

పరీక్షలు అంటే ఏమిటో, రిజర్వేషన్లు అంటే ఏమిటో తెలియని వ్యక్తులు డీఎస్సీ నియామకాలపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం సిద్ధాంతంలో నిర్వహించిన 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, వైసీపీపై తీవ్ర విమర్శలు చేశారు. గత పాలకులు జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి నిరుద్యోగులను దగా చేశారని, తాము అధికారంలోకి వచ్చాక ▶మిగతా 2లో

## డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్ భూదందాలు.. సస్పెండ్ చేసిన ప్రభుత్వం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 08)

హౌసింగ్ బోర్డులో భూసేకరణ అధికారిగా పనిచేసిన డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. హౌసింగ్ బోర్డులో 2013 నుంచి 2018 వరకు డిప్యూటేషన్‌పై హౌసింగ్ బోర్డులో భూసేకరణ అధికారిగా పనిచేసిన రాము నాయక్ అనేక భూ దందాలకు, అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడి నట్లు ప్రాథమికంగా తేలిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో చట్టాన్ని కాపాడాల్సిన అధికారులు.. కంచే చేను మేసినట్లుగా ▶మిగతా 2లో

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంలో 8 మంది మృతి

ఘటనపై వెంటనే స్పందించిన సీఎం చంద్రబాబు

బాధితులకు అత్యుత్తమ వైద్యం అందించాలని ఆదేశం

సహాయక చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సూచన

మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆందోళన



▶మిగతా 2లో

## రామోజీరావు స్థానం.. ప్రజల హృదయాల్లో శాశ్వతం: చంద్రబాబు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 08)



తెలుగు ప్రజలు గర్వించే మీడియా సంస్థలను అందించిన రామోజీరావు స్థానం ప్రజల హృదయాల్లో శాశ్వతమని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. రామోజీరావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఎక్స్ వేదికగా నివాళులర్పించిన సీఎం.. ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు."తెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడు, మీడియా రంగంలో ఓ యుగకర్త, అక్షర యోధుడు రామోజీరావుకు ▶మిగతా 2లో

## ఆంధ్రా పేపర్ మిల్స్‌కు షోకాజ్ నోటీసులివ్వండి

అధికారులకు పవన్ ఆదేశం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 08)

గోదావరిలో కాలుష్యానికి కారణమవుతున్న ఆంధ్రా పేపర్ మిల్స్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. ఇటీవల రాజమహేంద్రవరంలో గోదావరి నది కాలుష్యాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆ రోజు సేకరించిన నమూలను ప్రయోగశాలలో పరీక్షించిన అనంతరం వచ్చిన నివేదికలపై రాజమహేంద్రవరం జిల్లా అధికారులతో పవన్ సమీక్షించారు. నిర్దేశిత పరిమాణం కంటే భారీ స్థాయిలో ప్రమాదకర రసాయనాలు గోదావరిలో కలుస్తున్నట్లు నివేదికలో తేలిందన్నారు. ఇంత జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నెలకోసారి నమూనాలు సేకరిస్తున్నట్లు అధికారులు బదులు ఇచ్చారు. మరి అలాంటప్పుడు ఇంత కలుషితమవుతుంటే చర్యలు ఎందుకు తీసుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. వెంటనే ఆంధ్రా పేపర్ మిల్స్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. పర్యవేక్షణ సరిగా చేయని రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు కూడా నోటీసులు ఇవ్వాలని కాలుష్య నియంత్రణ ▶మిగతా 2లో

## ఏపీలో రేర్‌ఎర్త్ ఎలిమెంట్ రిఫైనింగ్ హబ్ ఏర్పాటును పరిశీలించండి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 08)

రాష్ట్రంలోని విశాఖపట్నం, శ్రీకాకుళంలో ఉన్న ఖనిజ వనరుల ఆధారంగా డీప్ ప్రాసెసింగ్, రేర్‌ఎర్త్ ఎలిమెంట్ రిఫైనింగ్ హబ్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని మంత్రి నారా లోకేశ్ రష్యాకు చెందిన రేర్‌ఎర్త్ మినరల్స్ సంస్థ గిరెడ్మెట్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులను కోరారు. రష్యా పర్యటనలో భాగంగా ఆ సంస్థ ప్రతినిధులతో లోకేశ్ మాస్కోలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ▶మిగతా 2లో

## అమ్మభాషలోనే ఆత్మీయత..

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 08)

ఆంగ్లంలో చిన్నారులు ఎంత బాగా మాట్లాడినా మాతృత్వ భావన పొందలేరని.. అమ్మభాషలోనే ఆ ఆత్మీయత ఉంటుందని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరంలోని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ) ప్రాంగణంలో చైతన్య సారస్వత పరిషత్, శ్రీశ్రీ కళావేదిక సంయుక్తంగా జీజీయూ ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణ (చైతన్యరాజు), శ్రీశ్రీ



కళావేదిక ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్ అధ్యక్షతన జరుగుతున్న ఏడో ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలు ఆదివారం ముగిశాయి. కార్యక్రమానికి మంత్రి దుర్గేష్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే, తితిదే పాలక మండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ.. తెలుగు భాషాభివృద్ధికి సహకరిస్తామని, సభల్లో చేసిన తీర్మానాలు అందిస్తే చట్టరూపంలో తీసుకొచ్చే బాధ్యత తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ▶మిగతా 2లో

## యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 08)

విజయవాడ (గవర్నర్‌పేట), లేపాక్షి, న్యూస్‌టుడే, ఈనాడు-కృష్ణా: యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగం చేసుకోవాలని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నుంచి ఈ నెల 21 వరకు యోగాంధ్ర పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అందులోభాగంగా విజయవాడలోని ▶మిగతా 2లో





## కౌలు రైతులకు ఇబ్బంది రానీయొద్దు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 08)

ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీలో కౌలు రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారుల్ని ఆదేశించారు. సోమవారం నుంచి యాప్ ద్వారా ఎరువుల పంపిణీ చేయనున్న నేపథ్యంలో ఆదివారం ఆయన జిల్లా కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లు, వ్యవసాయ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పంటల సరళి, అంచనా డిమాండ్ ఆధారంగా మండల స్థాయిలో ఎరువుల నిల్వలు ఉంచాలని సూచించారు. ▶మిగతా 2లో

# సమాజానికి సిగరెట్ కంటే వైసీపీ హానికరం

కార్యకర్తలను పయ్యావుల హెచ్చరించారు. చిన్నచిన్న అలకలు వీడి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని, ఏవైనా సమస్యలుంటే కొట్లాడైనా పరిష్కరించుకోవాలి తప్ప పార్టీకి దూరం కావొద్దని సూచించారు. "మనం ప్రభుత్వంలో ఉన్నామని నిద్రపోవద్దు.. రాయలసీమ రాజకీయాల్లో ఎప్పుడూ అప్రమత్తత అవసరం" అని పేర్కొంటూ.. టీడీపీ శ్రేణులు ఓటర్ లిస్ట్‌పై పూర్తి పట్టు సాధించాలని దిశానిర్దేశం చేశారు. అలాగే, తమ కూటమి ప్రభుత్వం రాయలసీమను 'హార్టికల్చర్ హబ్' (ఉద్యానవన కేంద్రం) గా మార్చడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుందని స్పష్టం చేశారు.

# రామోజీరావు స్థానం.. ప్రజల హృదయాల్లో శాశ్వతం: చంద్రబాబు

నివాళులు. సామాన్య కుటుంబం నుంచి అసామాన్య శిఖరాలను అధిరోహించి, మీడియాను ప్రజా చైతన్యానికి వేదికగా మలచిన ఆయన సేవలు చిరస్మరణీయం. విలువలు, క్రమశిక్షణ, నిబద్ధత, ధైర్యసాహసాలతో నడిచిన ఆయన ప్రస్థానం తరతరాలకు స్ఫూర్తి. పత్రికా రంగమంటే వ్యాపారం కాదు.. సామాజిక బాధ్యత అని భావించి, ఆచరించి చూపించిన ఆదర్శవాది. తెలుగు ప్రజలు గర్వించే మీడియా సంస్థలను అందించిన ఆయన స్థానం ప్రజల హృదయాల్లో శాశ్వతం. ఆయన కీర్తి అజరామరం" అని చంద్రబాబు ఎక్స్‌లో పోస్టు చేశారు.జర్నలిజంలో నాణ్యత, విశ్వసనీయతకు రామోజీరావు ప్రతీక అని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. మీడియా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన దార్శనికుడని కొనియాడారు. క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. రామోజీరావు స్ఫూర్తి.. తరతరాలకు వెలుగునిస్తూనే ఉంటుందని 'ఎక్స్'లో రాసుకొచ్చారు.

# డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్ భూదందాలు.. సస్పెండ్ చేసిన ప్రభుత్వం

ప్రభుత్వ భూములను కొల్లగొట్టారని ఆరోపించారు. హైదరాబాద్ కోర్ అర్బన్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం హౌసింగ్ బోర్డు, ప్రభుత్వ స్థలాలు పరిశీలిస్తుండగా.. రాము నాయక్ భూలీలలు బయటకు వచ్చాయని మంత్రి తెలిపారు. బహిరంగ మార్కెట్లో గజం సుమారు రూ.2లక్షల ధర ఉన్న హైకోర్టు గేట్ల వద్ద హౌసింగ్ బోర్డుకు చెందిన 33.53 చదరపు గజాల స్థలాన్ని రాము నాయక్ 2018 ఫిబ్రవరి 17న అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు బయటపడిందని మంత్రి తెలిపారు. హౌసింగ్ బోర్డులో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి సస్పెండ్ అయిన ఇఫ్తాకర్ అహ్మద్ భార్య పేరిట ఈ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని.. ఆ తర్వాత 2025లో ఆ భూమి మరొకరి పేరిట మారినట్లు విచారణలో తేలిందని పొంగులేటి తెలిపారు. భూమికి సంబంధించిన పత్రాలను పరిశీలించకుండా రిజిస్ట్రేషన్ చేసిన అప్పటి చార్మినార్ సబ్ రిజిస్ట్రార్‌పై కూడా విచారణకు ఆదేశించామని మంత్రి పొంగులేటి తెలిపారు. రాము నాయిక్ భూదందాలపై 2017 నుంచే పలు కేసులు ఉన్నప్పటికీ.. బీఆర్ఎస్ పాలకులు స్పందించలేదని మంత్రి చెప్పారు. విజయనగర్ కాలనీలో 400 చదరపు గజాలు, తుల్జాగూడలో 22 గజాలు, లక్ష్మిగూడలో 130 గజాలు, మహబూబ్ గంజ్‌లో 497 గజాల స్థలాలను రాము నాయక్ పలువురి పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని.. వాటన్నింటిపై విచారణ జరుపుతున్నామని మంత్రి వెల్లడించారు. ఈ కేసుల్లో సబ్ రిజిస్ట్రార్‌ల పాత్రపై విచారణ జరపాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల ఐజీని ఆదేశించామన్నారు. రాము నాయక్‌పై విచారణ పూర్తి చేసి అన్ని ఆధారాలను నిర్ధారించిన తర్వాత శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగిస్తామని తెలిపారు. రాము నాయక్ భూఅక్రమాలకు సహకరించిన సూపరింటెండెంట్ వివేకానంద్‌ను శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగించామని.. మరో సూపరింటెండెంట్ బోనా నాయక్‌ను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ భూములు ఆక్రమించినా.. ఆక్రమణలకు సహకరించినా ఉపేక్షించేది లేదని, ఏ హోదాలో ఉన్నప్పటికీ నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు అక్రమాలకు పాల్పడితే మరింత కఠినంగా వ్యవహరిస్తామని.. క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలు కూడా తీసుకుంటామన్నారు.

# ఏపీలో రేర్‌ఎర్త్ ఎలిమెంట్ రిఫైనింగ్ హబ్ ఏర్పాటును పరిశీలించండి

"భారత్‌లో విస్తరిస్తున్న ఈవీ, పవన విద్యుత్ మార్కెట్లకు సరఫరా చేసేందుకు గిరిడ్మెట్ ప్రాసెసింగ్ టెక్నాలజీని వినియోగించి, నెల్లూరులో ఫుల్ సైకిల్ రేర్‌ఎర్త్ శాశ్వత అయస్కాంతాల తయారీ కోసం నియోడైమియం మ్యాగ్నెట్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటులో భాగస్వాములు కావాలి. భారత్ టెక్ కారిడార్‌లో సిద్ధంగా ఉన్న ప్లగ్ అండ్ ప్లే ప్రయోగశాలలు వినియోగించి మెటలర్జీ అల్ట్రా-ప్యూర్ సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్ మెటీరియల్స్ ల్యాబ్ ఏర్పాటుకు చొరవ చూపండి. పారిశ్రామిక వ్యర్థాలు, మైనింగ్ టెయిలింగ్స్ నుంచి అరుదైన లోహాలు వెలికితీసేందుకు, సాంకేతికతను అందించడంలో భాగస్వాములు కావాలి" అని కోరారు.

## మొదటిపేజీ తరువాయి

మాస్కోలోని అణుశక్తి మ్యూజియం సందర్శన
అణుశక్తి మ్యూజియం వివరాలను తెలుసుకుంటున్న మంత్రి లోకేశ్

మాస్కోలోని అతిపెద్ద అణుశక్తి మ్యూజియంను లోకేశ్ సందర్శించారు. మాస్కో ప్రభుత్వం, రొసాటమ్ స్టేట్ కార్పొరేషన్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ మ్యూజియం అణుశక్తి చరిత్రను మాత్రమే కాకుండా.. శాంతియుత అణు వినియోగ విజయాలనూ వివరిస్తుంది. 25 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో 7 అంతస్తుల్లో ఈ మ్యూజియం ఏర్పాటైంది. సోవియట్ అణు ప్రాజెక్టు ప్రారంభ దశల నుంచి ఆధునిక అణుశక్తి రంగ అభివృద్ధి, భవిష్యత్తు శాస్త్రీయ అవకాశాల వరకు వివిధ అంశాలను ఈ మ్యూజియంలో ప్రదర్శిస్తారు. ఇప్పటివరకు 80 దేశాలకు చెందిన 35 లక్షల మంది ఈ ప్రదర్శనశాలను సందర్శించారని నిర్వాహకులు మంత్రి లోకేశ్‌కు వివరించారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 08)

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో 8 మంది కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే ఆయన ఉన్నతాధికారులతో అత్యవసరంగా సమీక్ష నిర్వహించి, సహాయక చర్యలపై కీలక ఆదేశాలు జారీ చేశారు.ప్రమాద తీవ్రత, ప్రస్తుత పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్న సీఎం, సహాయక చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణమే అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్లాంట్‌లో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రమాద స్థలంలో సహాయక చర్యలను పర్యవేక్షించాలని స్థానిక మంత్రులను, యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, వారికి అవసరమైన సహాయం అందించడంలో ఎలాంటి జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. ప్రమాద తీవ్రత దృష్ట్యా మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# ఆంధ్రా పేపర్ మిల్స్‌కు షోకాజ్ నోటీసులివ్వండి

మండలి అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాలు పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# కౌలు రైతులకు ఇబ్బంది రానీయొద్దు

జిల్లాల వ్యవసాయ అధికారులు రోజూ విశ్లేషణాత్మక నివేదికలు ఇవ్వాలని, రైతుల సమస్యల పరిష్కారానికి రియల్‌టైమ్ గ్రీవెన్స్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సీఎం కార్యదర్శి రాజమౌళి ఈ సందర్భంగా ఆదేశించారు. అన్ని రైతు సేవా కేంద్రాలకు లాగిన్ వివరాలు అందించామని వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల ఆధారంగానే ఎరువుల సిఫారసు జరుగుతుందని వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలాని సమూన్ వివరించారు.

# పరీక్షలంటే తెలియని వారు కూడా బురద జల్లుతున్నారు

దాదాపు 16 వేల టీచర్ ఉద్యోగాలు ఇచ్చామని గుర్తుచేశారు. ఏం చెప్పాలో తెలియక నేరాలు చేసి, ఎదుటివారిపై దుష్ప్రచారం చేయడమే 'గొడ్డలి పార్టీ' పనిగా పెట్టుకుందని విమర్శించారు. గొడ్డలి పట్టుకునే చేతులకు నాగలి పట్టే రైతులు గుర్తుకురారని, కోడికత్తి డ్రామాలు ఆడేవాళ్లకు వరికోతలు ఎలా తెలుస్తాయని ఎద్దేవా చేశారు.

**భూ రికార్డుల ప్రక్షాళన.. రాజముద్రతో పాస్‌పుస్తకాలు**

భూ వివాదాలకు తావులేని గోదావరి జిల్లాల్లో గత పాలకులు చిచ్చుపెట్టి రికార్డులు తారుమారు చేశారని చంద్రబాబు ఆరోపించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరిట ఓ నల్ల చట్టం తెచ్చి ప్రజల భూములను కాజేయాలని చూశారని, ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన రికార్డులను ప్రైవేటుకు అప్పగించే ప్రయత్నం చేశారని అన్నారు. "మేం అధికారంలోకి రాగానే ఆ నల్ల చట్టాన్ని రద్దు చేసి భూ యాజమాన్య హక్కుల్ని కాపాడాం. భూమి మీది, కానీ ఫొటోలు వారివి ముద్రించుకున్నారు. పొలం సరిహద్దు రాళ్లపై కూడా వారి బొమ్మలు వేసుకున్నారు" అని విమర్శించారు. ఈ సమస్యల పరిష్కారానికి బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్ వంటి పటిష్టమైన చర్యలతో, కరెన్సీ నోట్ల తరహా భద్రతా ఫీచర్లతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే 6,688 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 26.46 లక్షల పాస్‌పుస్తకాలు జారీ చేశామని, నిర్దేశిత గడువులోగా మొత్తం 90 లక్షల పుస్తకాలను రైతులకు అందజేస్తామని తెలిపారు. రెవెన్యూ శాఖలో సమూల మార్పులు తెచ్చి, 1.37 లక్షల ఎకరాల సర్వీస్ ఇనామ్ భూములను 22ఏ నుంచి తప్పించామని పేర్కొన్నారు.

**రెండేళ్ల పాలన.. అభివృద్ధి, సంక్షేమం**

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుందని చంద్రబాబు తెలిపారు. ఈ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మూడు ప్రాంతాల్లో సభలు పెడుతున్నామన్నారు. "అభివృద్ధిని తిరిగి ట్రాక్‌లో పెట్టాం. అందుకే రాష్ట్రానికి రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి, యువతకు ఉద్యోగాలు లభిస్తున్నాయి. సంక్షేమంలో దేశంలో ఎవరూ చేయలేని విధంగా ప్రజలకు మేలు చేస్తున్నాం. సూపర్ సిక్స్‌లో చెప్పిన వాటికంటే అదనంగానే ఇచ్చాం" అని అన్నారు. అన్నదాత సుఖీభవ కింద కేంద్రం వాటాతో కలిపి రైతులకు ఏటా రూ.20 వేలు అందిస్తున్నామని చెప్పారు.

**గోదావరి జిల్లాలకు పెద్దపీట**

దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా ఉన్న గోదావరి జిల్లాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో ధాన్యం అమ్ముకోవడానికి రైతులు పడిన ఇబ్బందులను గుర్తుచేస్తూ, తాము 24 గంటల్లోనే డబ్బులు జమ చేస్తున్నామని తెలిపారు.

ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే అందిస్తున్నామని, ఫీడ్ ధరల పెరుగుదల సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సానుకూల నిర్ణయం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, ఆక్వా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు.

**గొడ్డలి పార్టీకి రాజకీయాలు చేసే అర్హత లేదు**

తెలంగాణలో ఎమ్మార్వో, జేసీ సంతకాలు ఫోర్జరీ చేసి రూ.1500 కోట్ల భూకుంభకోణానికి పాల్పడిన వినుకొండ మాజీ ఎమ్మెల్యేను వైసీపీ అధ్యక్షుడు ఎందుకు సస్పెండ్ చేయలేదని చంద్రబాబు ప్రశ్నించారు. తిరుమల లడ్డూ ప్రసాదాన్ని కూడా కల్తీ చేసి అపవిత్రం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో రాజకీయాలు చేసే అర్హత 'గొడ్డలి పార్టీ'కి లేదని, వారు రాష్ట్ర ప్రజలకు, నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలంటే గంజాయి బ్యాచ్‌లను, గొడ్డలి పార్టీ వ్యక్తులను ప్రజలు దూరంగా పెట్టాలని పిలుపునిచ్చారు.

# యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి

బీఆర్‌టీఎస్ రోడ్డులో పోలీస్ శాఖ దాని అనుబంధ విభాగాలకు చెందిన సుమారు 5వేల మంది యోగాసనాలు వేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హోం మంత్రి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పిలుపు మేరకు సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. గంజాయి రహిత ఏపీ, ఆరోగ్య, ఆనంద ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్, పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు, ఈగల్ ఐజీ రవికృష్ణ, జేసీ ఇలక్కియా, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, డీసీపీలు కృష్ణకాంత్ పటేల్, షిరీన్ బేగం, కె.తిరుమలేశ్వర్‌రెడ్డి, కేజీవీ సరిత, ఎస్‌వీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నం బీచ్‌లో యోగా సాధన చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్ వద్ద గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం వందల మందితో సామూహిక యోగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రితో పాటు ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, డీసీఎంఎస్ ఛైర్మన్ రామకృష్ణ, కలెక్టరు డీకే బాలాజీ, జేసీ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో హోంమంత్రి అనిత

: క్రమం తప్పని యోగాతో ఆరోగ్యం చేరువవుతుందని మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవితలు పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని లేపాక్షి ఆలయ ప్రాంగణంలో ఆదివారం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఇతర అధికారులు, యువత, విద్యార్థులు హాజరయ్యారు.

# అమ్మభాషలోనే ఆత్మీయత..

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ చొరవ తీసుకుని ప్రాథమిక తరగతుల్లో తెలుగు తప్పనిసరి చేశారని గుర్తుచేశారు. త్వరలోనే నంది నాటకోత్సవాలు నిర్వహించి, పురస్కారాలు ప్రదానం చేస్తామన్నారు. అంతకుముందు చైతన్యరాజు మాట్లాడుతూ.. తమ విశ్వవిద్యాలయంలో తెలుగు, సంస్కృతంలో పరిశోధనలు చేసేందుకు దరఖాస్తు చేసిన (సభలకు వచ్చినవారిలో) వారికి ఫీజులో 50 శాతం రాయితీ ఇస్తామని ప్రకటించారు. తెలుగు సాహితీవేత్తలు టి.పార్థసారథి, ఎన్నారై జేమ్స్ వాట్ కొమ్ము, రాంప్రసాద్, మోటూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**శాసనసభ నుంచే తెలుగు వెలగాలి**

శాసనసభ నుంచే మార్పు మొదలవ్వాలని, ప్రతి ఒక్కరూ 'తెలుగులోనే సంతకం చేస్తా.. తెలుగులోనే మాట్లాడతా' అని నిర్ణయం తీసుకుంటే ఒకరి నుంచి మరొకరు స్ఫూర్తి పొందుతారని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అభిప్రాయపడ్డారు. కవులు, కళాకారులకు జాతి, ప్రాంత భేదాలు ఉండవని, ఎక్కడ సభలు నిర్వహించినా ఐక్యంగా పాల్గొంటారనడానికి ఈ సభలే నిదర్శనమని ఎమ్మెల్సీ సోము వీర్రాజు పేర్కొన్నారు.

# మాచర్లలో వైభవంగా జరిగిన స్వరనీరాజనం పాటల పోటీలు

(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జూన్ 8)




గానగంధర్వుడు, పద్మవిభూషణ్ డాక్టర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతి వేడుకలలో భాగంగా పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలో అత్యంత వైభవంగా డాక్టర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం కళాపరిషత్ – మాచర్ల వారి ఆధ్వర్యంలో 'స్వర నీరాజనం' పేరుతో నిర్వహించిన తెలుగు సినీ పాటల పోటీలు సంగీతాభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మాచర్ల పట్టణంలోని స్థానిక మానుకొండ కళ్యాణ మండపంలో ఆదివారం ఈ పోటీలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాల స్థాయి నుంచి భారీ సంఖ్యలో గాయనీగాయకులు తరలివచ్చి ఈ 'స్వర నీరాజనం' వేదికపై తమ ప్రతిభను చాటుకున్నారు. ముఖ్యంగా హైదరాబాద్, వైజాగ్, చీరాల వంటి సుదూర ప్రాంతాల నుంచి సైతం ప్రతిభావంతులైన కళాకారులు తరలివచ్చారు. ఎలాంటి ఎంట్రీ ఫీజు లేకుండా నిర్వహించిన ఈ పోటీల్లో పాల్గొన్న గాయనీగాయకులందరికీ కళాపరిషత్ వారు ఉచిత భోజన వసతి సౌకర్యాలను కల్పించారు. అభ్యర్థులు ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా పాడుతూ శ్రోతలను, సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేశారు.ఈ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన విజేతలకు కళాపరిషత్ నిర్వాహకులు భారీ నగదు బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతిరూ. 12,000లు ద్వితీయ బహుమతి రూ.8,000లు తృతీయ బహుమతి రూ.5,000లు నగదు బహుమతులతో పాటు పాల్గొన్న గాయనీ గాయకులకు పెద్ద ఎత్తున శాలువాలు కప్పి, జ్ఞాపికలు మెమెంటులతో బహూకరించి ఘనంగా సత్కరించారు. ఎస్పీ బాలసుబ్రమణ్యం కళాపరిషత్ అధ్యక్షులు పఠాన్ జాన్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మగులూరి రాంబాబు, కోశాధికారి కాశిబోయిన శివశంకర్ వీరి నేతృత్వంలో ఈ కార్యక్రమం అత్యంత క్రమశిక్షణతో విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఎస్పీ బాలసుబ్రమణ్యం భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన పాడిన పాటలు ఎప్పటికీ శాశ్వతంగా ఉంటాయని కొనియాడారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దాగున్న ఇలాంటి ఎందరో ప్రతిభావంతులైన గాయనీగాయకులను వెలికితీయడానికే ఈ 'స్వర నీరాజనం' కార్యక్రమాన్ని ఉచితంగా నిర్వహించినట్లు వారు తెలిపారు. ఇంతటి ఘనమైన కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు కళాకారులకు, పట్టణ ప్రజలకు కమిటీ ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని కళా పరిషత్ గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎం కమలాసన్‌రావు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపియూడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి విద్యాధరణి మురళి, మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు బీసీ నాయకులు బృంగా రమణారావు, ఎంబిఎస్ కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు బాహాటం శేషగిరిరాజు, ఓరుగంటి చెన్నకేశవరావు, ఇల్లూరి పుల్లారెడ్డి, గట్ల కోటిరెడ్డి, విద్యా ధరణి, నరసరాజు, కుర్రి శాయి మార్కొండారెడ్డి, చుండూరు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.




# కార్మికులందరికీ కనీస వేతనం రూ.18,600 ఇవ్వాలి

## ఏఐటీయూసీ డిమాండ్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)

రిమ్స్‌లో పనిచేసే కార్మికులందరికీ జీవో నెంబర్ 138 ప్రకారం కనీస వేతనం రూ.18,600 ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఏపీ మెడికల్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర యూనిట్ పిలుపుమేరకు ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం వద్ద కొన్ని సమస్యల పరిష్కారానికై ధర్నా నిర్వహించి, కలెక్టర్కు మెమోరండం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షులు ఎస్‌డి సర్దార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎస్‌డి సర్దార్, కొత్తకోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం జీవో నెంబర్ 138 ప్రకారం శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులందరికీ కనీస వేతనం రూ.18,600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాల నిండిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల నుండి నిలిపివేయాలనే నిర్ణయాన్ని వెనక తీసుకోవాలన్నారు. 8వ తరగతి చదివిన వారే విధులకు రావాలని ఆంక్షలు పెట్టడం సరికాదన్నారు. కాంట్రాక్టు పద్ధతి రద్దు చేసి కార్మికులను ఆప్కాస్ లో విలీనం చేయాలని, సాలీన జాతీయ పండుగలకు ఆర్జిత సెలవులు 25 రోజులు ఇవ్వాలని, ప్రతి నెల 7వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని, పిఎఫ్, ఈఎస్ఐ ప్రతి నెల రికవరీ చేసి వారి ఖాతాలకు జమ చేయాలని డిమాండ్ చేశారు.



ప్రకాశం



మార్కాపురం



బాపట్ల

షణ్ముఖ

వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు

తెలుగు దినపత్రిక

09.06.26 మంగళవారం




## సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోం

### కలెక్టర్ పి రాజాబాబు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)

'మీకోసం', స్పెషల్ గ్రీవెన్స్, పల్లె నిద్ర కార్యక్రమాలతో జిల్లా యంత్రాంగం ప్రజలకు చేరువవుతున్న నేపథ్యంలో సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోనని కలెక్టర్ పి రాజాబాబు స్పష్టం చేశారు. సోమవారం ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన " ప్రజా సమస్యల పరిష్కార వేదిక " ( మీకోసం ) కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారితో కలిసి ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్జీదారులు సంతృప్తి చెందేలా సత్వరం పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఏదైనా కారణంగా ఆ సమస్యను పరిష్కరించలేని పక్షంలో దానికి గల కారణాలను అర్జీదారునికి అర్థమయ్యే విధంగా ఎండార్స్‌మెంటు ఇవ్వాలని ఆయన చెప్పారు. అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం చూపకూడదన్నారు. 'మీకోసం' అర్జీలను ఎప్పటికప్పుడు ఆన్లైన్‌లో చెక్ చేసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డిఆర్ఓ మాధురి, జడ్పీ సీఈవో చిరంజీవి, డిపిఓ వెంకటేశ్వరరావు, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు. (తరువాయి 4లో...)

## మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా కొనసాగించాలి

### జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత పిలుపు





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 8)

జిల్లాలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని 4వ రోజు సోమవారం స్థానిక కలెక్టరేట్లో ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసరాల్లో పచ్చదనాన్ని పెంపొందించుకోవాల్సిన బాధ్యత మన పైనే ఉందన్నారు. మండల గ్రామస్థాయిలోనూ మొక్కలు నాటేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె వివరించారు. ప్రకృతిలో మమేకమైన వారికి అన్ని రకాలుగా స్వాంతన చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, ఆర్డీవో ఎం వెంకట శివరామిరెడ్డి, విద్యుత్‌శాఖ ఎస్ఈ అబ్దుల్ కరీం, ఇన్‌ఛార్జి జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాలాజీ నాయక్, ఉద్యానశాఖ అధికారి రమేష్, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, ఐసిడిఎస్ ఇంచార్జి పి డి పద్మావతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వైద్యసేవల పట్ల ప్రజల్లో సానుకూల దృక్పథం పెరగడమే లక్ష్యంగా పనిచేయాలి

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 8)

వైద్యసేవల పట్ల ప్రజల్లో సానుకూల దృక్పథం పెరగడమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదేశించారు. సోమవారం ప్రకాశం భవనం నుంచి పిహెచ్‌సీ, సీహెచ్‌సీ, జిజిహెచ్ ద్వారా అందుతున్న సేవల పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆస్పత్రి నుంచి అందుతున్న వైద్య సేవలు, డాక్టర్ల ప్రవర్తన, ఆస్పత్రుల్లో పారిశుద్ధ్యం, ఉచితంగా మందుల పంపిణీ వంటి అంశాలలో ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలో పేలవ ప్రదర్శన నమోదైన ఆసుపత్రుల వైద్యులతో ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. అక్కడి పరిస్థితి పై ఆరా తీశారు. భారీగా నిధులు ఖర్చు పెట్టి, అధునాతన పరికరాలను అందుబాటులోకి తెచ్చి, వైద్య రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో సేవల పట్ల ప్రజల్లో కూడా సానుకూల దృక్పథం మరింత పెరగాల్సి ఉందన్నారు. ఆయా విషయాలను దృష్టిలో పెట్టుకుని రోగులతో ప్రవర్తన, సేవలు, ఉచితముగా మందుల పంపిణీ, ఆసుపత్రి ప్రాంగణంలో పారిశుద్ధ్యం పై మరింత దృష్టి సారించాలన్నారు. స్వయంగా వైద్యులే ఆయా విషయాలలో రోగుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, డిసిహెచ్ఎస్ లక్ష్మీ కుమారి, జిజిహెచ్ సూపరింటెండెంట్ మాణిక్యరావు, అసిస్టెంట్ ఆర్ఎంఓ సునీల్, జిల్లా మలేరియా అధికారి మధుసూధనరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే ఏలూరి చొరవతో చెరువులకు సాగర్ జలకళ

### పర్చూరు నియోజకవర్గంలో జలకళ

### తాగునీటి సమస్యకు ముందస్తు పరిష్కారం

(షణ్ముఖ వెలుగు, పర్చూరు, జూన్ 8)

నిండు వేసవిలో చెరువులు సాగర్ జలాలతో జల కళను సంతరించుకున్నాయి. నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు చేపట్టిన ప్రత్యేక చర్యలు ఫలిస్తున్నాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి విడుదలైన జలాలు నియోజకవర్గంలోని చెరువులకు చేరడంతో పలు గ్రామాల్లో నీటి వనరులు పునరుజ్జీవం పొందుతున్నాయి. ఇప్పటికే ఎక్కువశాతం చెరువులు నిండగా, మిగిలిన వాటిని కూడా మరో నాలుగు నుంచి ఐదు రోజుల్లో పూర్తిస్థాయిలో నింపేం దుకు అధికారులు చర్యలు వేగవంతం చేశారు. వేసవి కాలంలో మంచినీటి సమస్య తలెత్తే అవకాశాలను ముందుగానే గుర్తించిన ఎమ్మెల్యే ఏలూరి, నీటి విడుదల అంశాన్ని ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా చర్చించారు. ఆయన చొరవతో ఎన్ఎస్‌పీ కాలువల ద్వారా సాగర్ జలాల విడుదలకు మార్గం సుగమమైంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు వైస్ చైర్మన్ చక్రపాణి పర్యవేక్షణలో మార్టూరు, యద్దనపూడి, పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు, చిన్నగంజాం మండలాల పరిధిలోని చెరువులను ప్రణాళిక బద్ధంగా ఎన్ఎస్పి, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు నింపుతున్నారు. చెరువు ఓల్లోకి సాగర్ జలాలు చేరడంతో భూగర్భ జలమట్టాలు పెరిగే అవకాశ ముండగా, గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి సరఫరాకు మరింత భరోసా ఏర్పడుతోంది. చెరువుల నింపుదల ప్రక్రియను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఎక్కడా ఆటంకాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టామని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి నీటి ఎద్దడి లేకుండా మంచినీరు అందేలా అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. చెరువులన్నీ నిండే వరకు పర్యవేక్షణ కొనసాగుతుందని, నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండకుండా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. సాగర్ జలాలతో చెరువులు కళకళలాడుతుం డటంతో ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ముందస్తు ప్రణాళికతో చేపట్టిన చర్యల ఫలితంగా ఈ ఏడాది తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టారు.

## సర్ పై టీడీపీ శ్రేణులు అవగాహన పెంచుకోవాలి




### వైసీపీ కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

(షణ్ముఖ వెలుగు, కొండపి, జూన్ 8)

కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ (సర్) పై క్షేత్రస్థాయిలో టీడీపీ శ్రేణులు అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కోరారు. సోమవారం ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం తూర్పునాయుడు పాలెం ఐవోసీ కార్యాలయం వద్ద కొండపి నియోజకవర్గ టీడీపీ బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్చార్జిలకు సర్ పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఒంగోలు టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ సర్ పై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా తొలగింపునకు గురికాకుండా జాగ్రత్త పడాలని, బూత్ స్థాయిలో ఏజెంట్లు అత్యంత ప్రమత్తంగా ఉండాలన్నారు. మన ఓట్లు ఉన్నాయో లేదో పరిశీలించుకోవడం మన బాధ్యత అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఓట్లు తొలగించేందుకు వైసీపీ కుట్రలు చేస్తోందని, (తరువాయి 4లో...)

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

## ప్రజలకు మరింత చేరువ

### జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు
### యర్రగొండపాలెంలో ప్రత్యేక పోలీస్ మీకోసం
### ప్రత్యేక పోలీస్ మీకోసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్న వైపాలెం పట్టణం, పరిసర ప్రాంత ప్రజలు
### మీ కోసం కార్యక్రమానికి 36 ఫిర్యాదులు




(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జూన్ 8)

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు, పోలీస్ అధికారులు సోమవారం యర్రగొండపాలెంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం)' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం, ఇతర ప్రాంతాల నుండి వివిధ సమస్యలతో వచ్చిన 36 మంది ఫిర్యాదుదారుల అర్జీలను ఎస్పీ స్వయంగా స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి యొక్క సమస్యల పూర్వాపరాలను సమగ్రంగా అడిగి తెలుసుకొని, వాటిని చట్టపరిధిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. జిల్లా ఎస్పీ ఆయా ఫిర్యాదుల పై సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి ఈ కార్యక్రమంలో వచ్చే ప్రతి అర్జీ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి చట్టప్రకారం విచారణ జరిపి ఫిర్యాదుదారులకు త్వరితగతిన న్యాయం అందించేలా చూడాలని, ప్రజా ఫిర్యాదుల పట్ల నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, కావున ఆ ఫిర్యాదుల పై తీసుకున్న చర్యల పై కూడా నివేదిక ఇవ్వవలసిందిగా పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు






పోలీసు వ్యవస్థను ప్రజలకు మమేకం చేయడంలో భాగంగా ఈ ప్రత్యేక మీ కోసం కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. యర్రగొండపాలెం పట్టణం, పరిసర ప్రాంతాల ప్రజలు ముఖ్యంగా మహిళలు, వృద్ధులు వారి సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసలు పడి మార్కాపురంలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి రాకుండా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. ప్రజా ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిచ్చి పూర్తి స్థాయి విచారణ జరిపి సత్వర న్యాయం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ ప్రత్యేక మీకోసం కార్యక్రమంలో ఎక్కువగా కుటుంబ కలహాలు, భర్త, అత్తారింటి వేదింపులు, భూ, ఆస్థి వివాదాలు ఇతర సమస్యల పై ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో మార్కాపురం డిఎస్పీ యు నాగరాజు, ఎస్‌బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, డిసిఆర్బీ ఇన్స్పెక్టర్ దేవప్రభాకర్, త్రిపురాంతకం సీఐ అస్సం, పొదిలి సీఐ రాజేష్ కుమార్, మార్కాపురం సీఐ అల్తాఫ్ హుసేన్, యర్రగొండపాలెం ఎస్ఐ దేవకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోం



# సర్ పై టీడీపీ శ్రేణులు అవగాహన పెంచుకోవాలి



వైసీపీ కుట్రల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. కొత్త ఓట్లు చేర్చడంతో పాటు ఉన్న ఓట్లు తొలగింపు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని మంత్రి స్వామి పిలుపునిచ్చారు.

# ఎరువుల దుకాణాల తనిఖీ





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 8)

పట్టణంలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ వారి ఆధ్వర్యంలో సోమవారం సాయి బాలాజీ ట్రేడర్స్, సాయి కృష్ణా ఫర్టిలైజర్స్, సీడ్స్ తనిఖీ చేయడం జరిగింది. ఈ తనిఖీల్లో భాగంగా తనిఖీ అధికారులు ఎన్ రాఘవరావు, కె శివ నాగ ప్రసాద్, ఏఓ రవికుమార్, దేవిరెడ్డి శ్రీనివాసులు సాయి బాలాజీ ట్రేడర్స్‌లో అమ్మకాలకు సంబంధించిన పత్రాలు గడువు ముగియటంతో ఆ సరుకును రెన్యూవల్ చేయించిన తర్వాత మాత్రమే అమ్మకాలు చేయాలని రూ.8,400ల సరుకులను అమ్మకాలు చేయకుండా నిలుపుదలు చేయడం జరిగింది. అంతేకాకుండా స్టాక్‌లకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు స్టాక్ బోర్డులో విధిగా రాయాలని, అదే విధంగా ఎమ్మార్పీ రేట్లు ప్రకారం మాత్రమే పాత, కొత్త ఎరువుల విక్రయాలు రైతులకు చేయాలన్నారు. అలా కాకుండా చట్ట వ్యతిరేక వ్యాపారాలు చేస్తే చట్ట రీత్యా చర్యలు ఉంటాయాని డీలర్‌లను హెచ్చరించారు.

# జిందాల్ మైనింగ్ పరిశ్రమను నిలిపివేయాలి

## కలెక్టరేట్ వద్ద గ్రామస్థుల ధర్నా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)

టంగుటూరు మండలం, మర్లపాడు గ్రామ పరిసరాలలో జిందాల్ పరిశ్రమ మైనింగ్ ఏర్పాటును పూర్తిగా వ్యతిరేకిస్తూ, గత (2011) ప్రజా వ్యతిరేకతను, పర్యావరణ ముప్పును పరిగణనలోనికి తీసుకోవాలని గ్రామ ప్రజలు స్పందన హాల్లో వినతి పత్రం అందజేసి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. మర్లపాడు, చుట్టుప్రక్కల గ్రామాలు (కొణిజేడు, కందులూరు, యరజర్ల, సర్వేరెడ్డిపాలెం) రైతులు మాట్లాడుతూ మా ప్రాంతంలో ప్రతిపాదిత జిందాల్ పరిశ్రమ ఏర్పాటును ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నామన్నారు. మర్లపాడు, పరిసర గ్రామాలు పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతాలు. ఇక్కడ రైతులు వాణిజ్య పంటలు, తోటలు (పొగాకు, యూకలిప్టస్, నిమ్మ, జామ, మామిడి వంటివి) సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ జిందాల్ వంటి భారీ పరిశ్రమ వస్తే, దాని నుండి వెలువడే రసాయన వ్యర్థాలు దుమ్ము, ధూళి, పొగ వల్ల వేలాది యకరాల సారవంతమైన భూములు నిరుపయోగముగా మారి, రైతాంగము రోడ్డున పడే ప్రమాదం ఉంది. ఈ పరిశ్రమకు అవసరమయ్యే భారీ నీటి వినియోగము వల్ల ఇప్పటికే ఉన్న భూగర్భ జలమట్టాలు పడిపోతాయన్నారు. అంతే కాకుండా పరిశ్రమల నుండి వచ్చే కలుషిత జలాలు భూమిలోకి ఇంకితే మా త్రాగునీటి బావులు, బోర్ల లోని నీరు విషపూరితంగా మారుతుంది. ఇది వ్యవసాయానికే కాకుండా త్రాగునీటికి కూడా తీవ్ర కొరతను సృష్టిస్తుందన్నారు. పరిశ్రమ నుండి వచ్చే కాలుష్య కారకాలు (బొగ్గుపొడి, ఇనుప రజనం, విషవాయువులు) గాలిలో కలవడం వలన స్థానిక ప్రజలు ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్రమైన శ్వాసకోశ వ్యాధులు, ఊపిరితిత్తులు, కిడ్నీ, గుండె సమస్యలు, క్యాన్సర్ వంటి ప్రణాంతక వ్యాధుల భారినపడే అవకాశం ఉందన్నారు. ఇదే మర్లపాడు గ్రామంలో 2011 డిసెంబర్ 17వ తేదీన అప్పటి జింపాక్స్ పరిశ్రమ ఏర్పాటుకు కాలుష్య నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టినప్పుడు స్థానిక ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయింది. ఆనాడు జరిగిన ఉద్రిక్తతలు పోలీసులు లాఠీచార్జి, ప్రజల తిరుగుబాటు వార్తలు ప్రముఖ దినపత్రికలలో పతాక శీర్షికలుగా వచ్చాయి. ప్రజల తీవ్ర నిరసనల నడుమ ఆనాడు ఆ సభ రద్దు అయినది. 15 సంవత్సరాల క్రితమే మా ప్రజలు ఈ కాలుష్య పరిశ్రమలను తిరస్కరించారనే దానికి ఇది సజీవ సాక్షమన్నారు. గతంలో ప్రజలు ప్రాణాలొడ్డి పోరాడి ప్రాంతంలోనే ఇప్పుడు మరలా పేరు మార్చి జిందాల్ పరిశ్రమను తీసుకొని రావడం స్థానిక ప్రజల సెంటిమెంట్‌ను వారి హక్కులను కాలరాయడమే అవుతుంది. ప్రజాస్వామ్యంలో ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి మొదట ప్రాధాన్యత ఇవ్వాలి. కావున ఉన్నతాధికారులు స్పందించి మర్లపాడు గ్రామంలో ఎలాంటి జిందాల్ పరిశ్రమకు అనుమతులు ఇవ్వరాదని తలపెట్టిన ప్రాజెక్టు తక్షణమే ఉపసంహరించుకోవాలని పై తెలిపిన 5 గ్రామాల ప్రజల తరుపున చేతులు జోడించి ప్రార్థిస్తున్నాము. ఒకవేళ ప్రజల అభిప్రాయాన్ని కాదని ముందుకు వెళితే గతములో కంటే తీవ్రమైన ప్రజాఉద్యమం మరియు చట్టపరమైన పోరాటం చేయవలసి వస్తుందని తమరికి మనవి చేస్తున్నామన్నారు.

# ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

## జివివి రాఘవరెడ్డి



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జూన్ 8)

ప్రభుత్వ ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, పరిష్కారానికి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) బాపట్ల జిల్లా శాఖ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసింది. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో పరిపాలన అధికారి దేవిశెట్టి మల్లికార్జునరావుకి ఏపీజీఈఏ జిల్లా చైర్మన్ జివివి రాఘవరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎన్పీ పుల్లారావు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీజీఈఏ జిల్లా చైర్మన్ జివివి రాఘవరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, పలు క్యాడర్ల సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్లో చర్చించాల్సిన అంశాల పై కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారికి వివరించారు. ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులు, సర్వీసు సమస్యలు, ఖాళీ పోస్టుల భర్తీ తదితర అంశాల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. గత నెల 22న ప్రభుత్వం విడుదల చేసిన జీవో 1032 ప్రకారం జూన్ 1 నుంచి 15 మధ్య ఒక తేదీ, సమయాన్ని నిర్ణయించి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జివివి రాఘవరెడ్డి, ఎన్‌పి పుల్లారావు పాల్గొన్నారు.

# నూతన దంపతులను ఆశీర్వదించిన యువనేత కందుల విగ్నేష్ రెడ్డి



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 8)

మండలంలోని తుమ్మగుంట గ్రామంలో టీడీపీ కార్యకర్త టోనీ వివాహ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుమారుడు యువనేత కందుల విగ్నేష్ రెడ్డి హాజరై నూతన దంపతులకు పుష్పగుచ్ఛం అందజేసి, ఆశీర్వచనాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలో పొదిలి పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు షేక్ కాలేషా, మాజీ వార్డు మెంబర్ జ్యోతి మల్లికార్జున, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)

ప్రకాశం జిల్లాలో నిర్వహించబడుతున్న పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం డిఆర్ఆర్ మున్సిపల్ హైస్కూల్, ఒంగోలులో ప్రారంభమైంది. ఈ మూల్యాంకన శిబిరానికి క్యాంప్ ఆఫీసర్‌గా జిల్లా విద్యాశాఖ అధికారి సివి రేణుక వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆమె మూల్యాంకనంలో పాల్గొన్న ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ జవాబు పత్రాల మూల్యాంకనంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులు రాసిన సమాధానాలకు అనుగుణంగా సరైన మార్కులు కేటాయించాలని తెలిపారు. మార్కుల నమోదుకు సంబంధించి స్పెషల్ అసిస్టెంట్లకు ట్యాబ్‌ల ద్వారా మార్కుల ఎంట్రీ చేసే విధానంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఎం శ్రీనివాసరావు, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్‌గా ఒంగోలు మండల విద్యాశాఖ అధికారి టి కిషోర్ బాబు, అసిస్టెంట్ క్యాంప్ వాల్యుయేషన్ ఆఫీసర్లుగా జరుగుమల్లి మండల విద్యాశాఖ అధికారి బి నాగేంద్రవదన్, జరుగుమల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి సుధాకర్ పాల్గొన్నారు.

# డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పరాదు




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)**

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పరాదని మెనూ చార్జీలు, వేతనాలు పెంచాలని కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా జరిగింది. ఈ ధర్నాకు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. మధ్యాహ్న భోజన పథక కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి కల్పన మాట్లాడుతూ తరగతి గదుల్లో ఆకలితోనూ, పిల్లల్లో పోషకాహారలేమిని తొలగించడానికి పడిపోతున్న అక్షరాస్యత, స్కూల్ డ్రాప్స్ తగ్గుదలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుంది. 2003 నుండి ఈ పథకంలో జిల్లాలో 4,000 మంది పనిచేస్తున్నారు. ప్రభుత్వం వేతనాలు, బిల్లులు ఇచ్చినా, ఇవ్వకపోయినా తల్లి మనసుతో వండి పెడతామన్నారు. అటువంటి పథకాన్ని ఈ రోజు స్మార్ట్ కిచెన్ పేరుతో ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలని చూస్తున్నారు. వీరు ఎక్కడో వండి స్కూల్‌కి తీసుకువచ్చి పెడతారట. అట్లా చేస్తే పోషక విలువలు చనిపోతాయన్నారు. పిల్లలకి బలమైన ఆహారం అందదన్నారు. అదీ కాక కార్మికుల ఉపాధి కూడా పోతుందన్నారు. అందుకని పిల్లలకు మంచి భోజనం కావాలంటే స్కూల్లో వేడివేడిగా అక్కడే వండి పెడితేనే పిల్లలకు పౌష్టికాహారం అందుతుందన్నారు. గత 20 సంవత్సరాల నుంచి సమర్ధవంతంగా అమలు చేస్తున్న వర్కర్లను తొలగించడం భావ్యం కాదన్నారు. మహిళా సాధికారత గురించి చెప్పే ప్రభుత్వం మహిళల ఉపాధిని పోగొట్టే నిర్ణయాలు చేయడం సరైంది కాదన్నారు. అంతే కాకుండా ఈ పథకంలో పని చేస్తున్న కార్మికులకు ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థికి 6-45 పైసలు, 6 నుంచి 8వ తరగతి పిల్లలకి 8 -36 పైసలు, 9 10 తరగతి విద్యార్థులకు 9 -29 పైసలు ఇస్తున్నారు. ఈ డబ్బులతో ఎలా వండి పెట్టాలో ప్రభుత్వమే చెప్పాలన్నారు. ఈ రోజు పెట్రోల్, గ్యాస్, డీజిల్ రేట్లు పెరిగాక ప్రతి వస్తువు కిలోకి 40 నుండి 50 రూపాయలకు పెరిగిందన్నారు. ఇది ప్రభుత్వానికి తెలియదా అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రతి పిల్లవాడికి మెనూ చర్చి రూ.20లు ఇవ్వాలని, 7, 8 గంటలు పని చేస్తున్న కార్మికులకు రూ.3,000లు మాత్రమే ఇస్తున్నారన్నారు. ఇది ఏ మాత్రం సరిపోవట్లేదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనం కనీసం రూ.10 వేలు ఇవ్వాలని, గ్యాస్, సరుకులు ప్రభుత్వమే సరఫరా చేయాలని, రెండు సెట్ల యూనిఫామ్ ఇవ్వాలన్నారు. 9, 10 తరగతులకు వేతనాలు ఇవ్వాలని, అధికారుల వేధింపులు ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు జరుగుతుందన్నారు. ప్రపంచంలోనే చాలా ప్రాధాన్యత గల స్కీమ్‌గా పేరు ఉందన్నారు. పేద పిల్లలకు బలమైన ఆహారాన్ని అందించటతో పాటు, బడి ఈడు పిల్లలను బడిబాట పట్టించే పథకం ఇది అని తెలిపారు. దీన్ని స్మార్ట్ కిచెన్ పేరుతో ప్రైవేట్ ఏజెన్సీకి ఇవ్వడం అంటే పిల్లలకి పౌష్టికాహారం దూరం చేయడమేనన్నారు. ఎందుకంటే ఇప్పుడు వండే వర్కర్లు స్కూల్లోనే వేడివేడిగా వండి పెడతారు. హెడ్మాస్టర్ల పర్యవేక్షణ ఉంటుంది. పిల్లలు సరిగ్గా తినకపోయినా, వెంటనే మార్చి పెట్టించే అవకాశం ఉంటుందన్నారు. కానీ ప్రైవేటేజెన్సీలు ఎక్కడో, ఎప్పుడో వండి స్కూల్స్‌కి బాక్స్‌లో పెడితే మధ్యాహ్నం తినబోయేసరికి నీరుగారిపోయి తినలేని పరిస్థితి ఉంటుందన్నారు. దీనిలో ఉండే పోషకాలు అన్నీ కూడా చనిపోతాయన్నారు. పిల్లలకు మంచి భోజనం ఉండదన్నారు. అందుకని ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు ఇచ్చే స్మార్ట్ కిచెన్స్ రద్దు చేయాలన్నారు. స్కూల్స్‌ కట్టెల పొయ్యిలో వండితే ఊరుకోవడం లేదు. గ్యాస్ మీద వండాలంటున్నారు. ఈ రోజు గ్యాస్ కొనాలి అంటే కమర్షియల్ గ్యాస్ రూ.3,500 ఉందన్నారు. అది కూడా దొరకని పరిస్థితి. ప్రభుత్వం ఇచ్చే బిల్లులు గ్యాస్ కొనటానికి కూడా సరిపోని పరిస్థితి. ప్రభుత్వమే ప్రతి స్కూల్‌కి గ్యాస్ సరఫరా చేయాలన్నారు. పనిచేసే క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగితే ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. 9, 10 తరగతి విద్యార్థులకు వండి పెడుతున్నందుకు వేతనం ఇవ్వాలన్నారు. ప్రతి నెల 5వ తేదీ లోపు బిల్లులు వేతనాలు వేయాలని, పథకం అమలుకు కనీస సౌకర్యాలైన మంచినీళ్ళు, వంట షెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రత్నకుమారి, అనంతలక్ష్మి, మీరాబి, ఆదామ్బి, కోటేశ్వరి, రమాదేవి, శేషమ్మ, రాధ, తిరుపతమ్మ, ఈశ్వరమ్మ, భూలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## అడవుల పెంపుదల, జీవ వైవిధ్య పరిరక్షణకు సీడ్ బాల్స్ ఉపయోగం

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)**

అడవుల పెంపుదల, జీవ వైవిధ్య పరిరక్షణకు సీడ్ బాల్స్ (విత్తన బంతులు) ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు చెప్పారు. ఈ దిశగా ప్రజలకు అవగాహన కల్పించేలా అటవీశాఖ రూపొందించిన పోస్టర్‌ను సోమవారం ' మీకోసం ' కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డిఆర్ఓ మాధురి, డిఎఫ్ఓలు వినోద్ కుమార్, రాజశేఖర్, డిపిఓ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం.. కేసు నమోదు



**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 8)**

యువతి అదృశ్యమైన ఘటన మండలంలోని మోటుపల్లి పంచాయతీలోని కృష్ణా నగర్ కాలనీ నందు చోటుచేసుకుంది. చిన్నగంజాం ఎస్ఐ ఎస్ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని మోటుపల్లి పంచాయతీలోని కృష్ణా నగర్ కాలనీ చెందిన బత్తుల రమాదేవి ఈ నెల 7 నుండి కనిపించటం లేదని ఉలవపాడు గ్రామానికి చెందిన ఆమె తల్లి యైన దేవళ్ళ మంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జూన్ 8)**

క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం, ప్రశాంత జీవన శైలిని పొందవచ్చు ఎంపీడీవో పి సుజాత అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం యోగానంద కార్యక్రమం ఎంపీడీవో సుజాత ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా చేయటం వల్ల రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది, రక్తపోటును, కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచుతుంది. యోగా వల్ల నాడీ వ్యవస్థ ప్రశాంతపడుతుంది. తద్వారా ఒత్తిడి తగ్గి మనస్సు ప్రశాంతంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వి పుల్లారావు, ఏపీవో సుధాకర్‌రావు, ఏపిఎం శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, ఎంఈఓ లు రవిచంద్ర, ట్రైని కోటేశ్వరరావు, భాగ్యవతి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఎంఎల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

## దేవరకొలుపులో పాల్గొని పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్







**(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, జూన్ 8)**

మండలంలోని గడియపూడి కాలనిలో రజికాల దేవర కొలుపుల కార్యక్రమంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్‌కుమార్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ సెక్రటరీ ఆడక స్వాములు, మండల పార్టీ అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మండల సెక్రటరీ మందపల్లి శ్రీనివాసరావు, మద్దిపాడు మండల టిడిపి సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావు (పియస్ఆర్), గ్రామ పార్టీ అధ్యక్షులు అన్నంనేని సుబ్బారావు, మార్నెని రాఘవ, కావూరి విజయ్‌రాజ్, మొనపాటి రామకృష్ణ, గడ్డం రవి, రమేష్, బేతంపూడి రాము, ముప్పా రవి, తదితరులు పాల్గొన్నారు.

## సముద్రాన్ని కాపాడుదాం భవిష్యత్తును భద్రపరుచుదాం



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 8)**

ప్రపంచ సముద్ర దినోత్సవం సందర్భంగా సోమవారం చీరాల బీచ్‌లో గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సముద్ర పరిరక్షణ, సముద్ర కాలుష్య నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బీచ్ పరిసరాల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను స్వచ్ఛంద కార్యకర్తలు తొలగించి పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు, మత్స్యకారులు, పర్యాటకులకు సముద్రాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు పిలుపునిచ్చారు. సముద్ర జీవుల సంరక్షణ, పర్యావరణ సమతుల్యత కోసం సముద్రాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుడ్ హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు, స్వచ్ఛంద కార్యకర్తలు, స్థానిక యువత, పర్యాటకులు పాల్గొన్నారు.

## యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 8)**

యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యము, మానసిక ప్రశాంతత లభిస్తాయని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా చేస్తున్న యోగా సాధనలో భాగంగా సోమవారం ప్రకాశం భవనం ఎదురుగా ఉన్న రోడ్డులో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇందుకోసం తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ స్వయంగా నడుచుకుంటూ వచ్చారు. యోగాసనాలు వేసి, ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజల్లో స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఇందులో భాగంగా ప్రజలందరూ యోగా సాధన చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రకాశం జిల్లాలోనూ గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు 15 రోజులపాటు ఇలాంటి సాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగా భారతదేశంలో పుట్టి, ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన కళ అని చెప్పారు. ఆరోగ్యకరంగా, సాత్వికంగా ఉండేందుకు యోగా చక్కని మార్గమని అన్నారు. దీనిని నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డిఆర్ఓ మాధురి, జడ్పీ సీఈవో చిరంజీవి, డిపిఓ వెంకటేశ్వరరావు, డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు, మెప్మా పీడి విజయలక్ష్మి, ఆర్డిఓ చంద్రశేఖర్ నాయుడు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకట కృష్ణయ్య, ఆయుష్ విభాగ సీనియర్ వైద్యులు భ్రమరాంబ, భీమ్ నాథ్, డి.ఎస్.డి.వో. రాజరాజేశ్వరి, ఇతర అధికారులు, పతంజలి యోగ సంస్థ గురువులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. కాగా, 45 నిమిషాల పాటు చేసే కామన్ యోగా ప్రోటోకాలును తెలిపే పోస్టరును ' మీకోసం ' కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, ఇతర అధికారులు ఆవిష్కరించారు.







షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
6 | 09.06.26 మంగళవారం

## వీఆర్వోల పై పనిభారం తగ్గించండి





(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 8)

తమపై పనిభారం తగ్గించాలని కోరుతూ మండల తహసీల్దారు జె ప్రభాకరరావుకు మండల వీఆర్వోలు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం, అధికారులు చెప్పిన పనులు సకాలంలో పూర్తి చేయలేక కొందరు మానసిక ఆందోళనకు గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వీఆర్వోలు ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లా కు చెందిన విఅర్ఓ హుస్సేన్ అధికారుల ఒత్తిడి, పనిబరం వలన బలమరణానికి పాల్పడడం జరిగిదన్నారు. తాము ప్రభుత్వానికి, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకం కాదని, కానీ తమపై విపరీతంగా పని భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సర్వ,పనిపై టార్గెట్ విధించడం తగదన్నారు. వీఆర్ఏల కొరత తీవ్రంగా ఉందని, వీఆర్వోలకు పని భారం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ రెవిన్యూ అధికారుల రాష్ట్ర సంఘం పిలుపు మేరకుపనిభారం తగ్గించాలని బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్‌కి తహశీల్దార్ జె ప్రభాకరరావు ద్వారా వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఅర్వోలు దానియేలు, కళ్యాణ్, రాధికా, చెంచు పునమ్మ, సత్యనారాయణ, నాగేశ్వరావు, నాగరాజు, పద్మ, బాపట్ల జిల్లా విఅర్ఓల సంఘ ప్రధాన కార్యదర్శి షేక్ మునీర్, విఅర్ఎలు సాలేమ్, అనీల్ పాల్గొన్నారు.

## పెద్దకొత్తపల్లి నేల చప్టాకి ప్యాచ్ వర్క్ చేస్తున్న ఆర్ అండ్ బి అధికారులు







(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, జూన్ 8)

మండల పరిధిలోని పెద్ద కొత్తపల్లి గ్రామ ముఖద్వారాన ముదిగొండ వాగు పై నిర్మించిన నేల చప్టాను టిడిపి సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావు (పియస్ఆర్) సోమవారం మండల నాయకులతో కలిసి పరిశీలించారు. ఏళ్ళ కిందట నిర్మించిన నేల చప్టా కావడంతో పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. వర్షాలు పడిన ప్రతిసారి ముదిగొండ వాగు ప్రవహిస్తుండటంతో నేల చప్టా పూర్తిగా మునిగిపోయి గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో సమస్యను ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ప్యాచ్‌వర్క్‌లు చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. దీంతో వారు ఆ పనులను పరిశీలించారు. సుమారు లక్ష రూపాయలతో ప్యాచ్ వర్క్ చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా పోతినేని శ్రీనివాసరావు అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట టిడిపి మండల సెక్రెటరీ మందపల్లి శ్రీనివాసరావు, శ్రీవారి ఆలయం చైర్మన్ మార్నేని రాఘవ, ముప్పా రవి, మోనపాటి రామకృష్ణ, గడ్డం రవి, బేతనంమూడీ రాము, కావూరి విజయరాజు, పలువురు నాయకులు ఉన్నారు.

# పోలీస్ స్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

**కేసుల వివరాలు, ప్రస్తుత స్థితిగతుల పై ఆరా**
**పలు రికార్డుల పరిశీలన**
**సాంకేతిక పరిజ్ఞానంతో నేర పరిశోధన, నేర నియంత్రణకు కృషి చేయాలి**
**మహిళలు, చిన్నారులు, వృద్ధుల పై జరిగే నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి**
**మార్కాపురం జిల్లా పోలీస్‌శాఖ ప్రజా భద్రత, సమస్యల పరిష్కారంలో సమర్ధవంతంగా పనిచేస్తోంది**
**మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు**







(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, జూన్ 8)

పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాల పనితీరు, సిబ్బంది నిర్వహణ, మౌలిక సదుపాయాల స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు యర్రగొండపాలెం, త్రిపురాంతకం స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలను సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్, సర్కిల్ కార్యాలయాల పరిసరాలు, కార్యాలయ గదులు, రిసెప్షన్ కౌంటర్, నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్లు, ఫైళ్లు, ఇతర రికార్డులను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలోని నేరాలు, శాంతిభద్రతల పరిస్థితి, ఎక్కువగా నమోదవుతున్న కేసులు, వారు నిర్వహిస్తున్న విధులు తదితర అంశాలపై ఆరా తీశారు. కేసుల దర్యాప్తులో నాణ్యతను పెంపొందిస్తూ విచారణలను వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న కేసులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల పై జరిగే నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నేరాల నియంత్రణలో భాగంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు వంటి రద్దీ ప్రాంతాల్లో విజిబుల్ పోలీసింగ్‌ను మరింత పెంచాలని, వాహనాల తనిఖీలు నిర్వహించాలని, అనుమానిత వ్యక్తులను గుర్తించి





విచారించాలని సూచించారు. చెడునడత గల వ్యక్తులు, పాత నేరస్థులపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఇంకా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను త్వరితగతిన డిస్పోసల్ చేయాలన్నారు. మార్కాపురం జిల్లా ఏర్పాటైన అనంతరం ప్రజలకు మరింత చేరువగా ఉండే విధంగా జిల్లా పోలీస్ శాఖ సమర్ధవంతంగా పనిచేస్తోందని మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు తెలిపారు. ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించడం, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలలో భద్రతా భావన పెంపొందించడం వంటి అంశాల పై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టడంతో పాటు, ప్రతి పోలీస్ అధికారి ప్రజా సమస్యల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశాలు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదేవిధంగా గొడవలు, వివాదాలు, కొట్లాటలు వంటి సమస్యలను చట్టబద్ధంగా, త్వరితగతిన పరిష్కరించే దిశగా పోలీసులు కృషి చేస్తున్నారన్నారు. మహిళలు, బాలికల భద్రత , రక్షణ పోలీస్ శాఖ ప్రథమ ప్రాధాన్యత అని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. మహిళలపై జరిగే నేరాల నివారణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు వివిధ చట్టాలు, వ్యక్తిగత భద్రత, సైబర్ నేరాల నివారణ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే ప్రతి మండల పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా సైబర్ నేరాలు, రోడ్డు భద్రతా నియమాలు, మత్తు పదార్ధాల వల్ల కలిగే అనర్ధాలు, చట్టాలు, శిక్షలపై అవగాహన వంటి అంశాలపై ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలకు వెంటనే స్పందించి పరిష్కారం అందించే విధంగా పోలీస్ శాఖ పనిచేస్తోందని, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు కూడా పోలీస్‌శాఖతో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం డిఎస్పీ యు నాగరాజు, ఎస్బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, డిసిఆర్‌బి ఇన్స్పెక్టర్ దేవప్రభాకర్, త్రిపురాంతకం సిఐ అస్సమ్, యర్రగొండపాలెం ఎస్ఐ దేవకుమార్, త్రిపురాంతకం ఎస్ఐ శివరామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## పెంచిన గ్యాస్ ధరలు ఉపసంహరించాలి

### ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను వెంటనే ఉపసంహరించుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. గడిచిన మూడు నెలల్లో 89 రూపాయలు వంట గ్యాస్ సిలిండర్ పై ధర పెంచి కేంద్ర ప్రభుత్వం సామాన్య, మధ్యతరగతి ప్రజల మీద భారం మోపిందని అన్నారు. పెంచిన గ్యాస్ సిలిండర్ ధర ను సంహరించాలని కోరుతూ సోమవారం స్థానిక సత్యనారాయణపురం సెంటర్ లో ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ధరలు తగ్గిస్తామని అధికారంలోకి వచ్చిన కేంద్ర రాష్ట్ర పాలకులు ప్రజల మీద నిత్యం భారాలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి 450 రూపాయలు ఉన్న సిలిండర్ ధర ఈరోజు ఏకంగా వెయ్యి రూపాయలకు పెరిగిందని అన్నారు. వాణిజ్య సిలిండర్ ధర 3,300 లకు చేరిందని, పొరపాటున టిఫిన్ చేద్దామని హోటల్ కి వెళ్తే ఆ భారం కూడా ప్రజల మీదే పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు ఇస్తామన్న మాట అటకెక్కిందని అన్నారు. మరోవైపు పెట్రోల్ డీజిల్ ధరలు రోజూ పెరుగుతున్నాయని ఫలితంగా నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు. ప్రజల ఆదాయాలు పెరగకుండా, భారాలు పెరుగుతుంటే ఎలా బ్రతకాలని ఆమె ప్రశ్నించారు. ఐద్వా నగర కార్యదర్శి జి ఆదిలక్ష్మి మాట్లాడుతూ మన రాష్ట్రంలోని కృష్ణా గోదావరి బేసిన్ లోని ఆయిల్, గ్యాస్ వనరులను రాష్ట్ర అవసరాలకు వినియోగించుకోవడం ద్వారా ప్రజల మీద భారాలు తగ్గించవచ్చని మేధావులు చెప్తున్నా అంశాలు ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోలియం ఉత్పత్తుల మీద వేస్తున్న పనులు తగ్గించడం ద్వారా ప్రజల మీద భారాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. నిత్యవసర వస్తువుల ధరలను అరికట్టే విధంగా, ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు కూటమి ప్రభుత్వం ఉచితంగా మూడు సిలిండర్లు ఏడాదికి పంపిణీ చేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని లేనిచో ప్రభుత్వానికి ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెపుతారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమం లో ఐద్వా నాయకులు వై అంజనీదేవి, కె రాజేశ్వరి, జి కళ్యాణి, కె శ్రీలత, కె నాగలక్ష్మి, కె శ్రీరంజని, వి రమాదేవి, వి భారతి, ఏ సత్యవతి, వి అన్నపూర్ణమ్మ, పి పద్మ, టి విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు జరిగిన అన్యాయం పై నిరసన




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా పార్టీ అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు మెగా డీఎస్సీలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు జరిగిన అన్యాయాన్ని ఖండిస్తూ సోమవారం ఒంగోలులో పార్టీ జిల్లా యస్సి సెల్ విభాగం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షులు గాలిమూటి దేవప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్సీ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు పాల్గొని మాట్లాడారు. మెగా డీఎస్సీలో జరిగిన అవకతవకల పై సిబిఐ చే సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. మెగా డీఎస్సీ అవకతవకలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దోచుకోవడం, దాచుకోవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత అంబేద్కర్, జగజ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఉన్నం జనార్ధన్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి యరిజర్ల రమేష్ బాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఉన్నం జనార్ధన్, రాష్ట్ర కార్యదర్శి కందుల డానియెల్, సంయుక్త కార్యదర్శి దుడ్డు వినోద్, ఒంగోలు నియోజకవర్గ అధ్యక్షులు డి రమణయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మేళం, గురవయ్య (మధు), జిల్లా ప్రచార కమిటీ ఉపాధ్యక్షులు పాలెపోగు దగ్లస్, ఎస్సీ సెల్ దర్శి నియోజకవర్గ అధ్యక్షులు జి ఏసుదాస్, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు బొట్ల సుబ్బారావు, నాయకులు కరుణాకర్, యోహాను, పీటర్ అచ్చయ్య, కిరీటి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులను పరిష్కారించటమే లక్ష్యంగా మీ కోసం

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 85 ఫిర్యాదులు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)

జిల్లా ప్రజల నుంచి వచ్చే వివిధ రకాల ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం అందించాలనే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీపి శ్రీధర్, పోలీస్ అధికారులు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో 'మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదిదారులు తమ సమస్యలకు సంబంధించిన వ్రాతపూర్వక అర్జీలను పోలీస్ అధికారులకు అందించి, వారియొక్క సమస్యలను వివరించారు. పోలీస్ అధికారులు ఫిర్యాదుదారులతో ముఖాముఖీగా మాట్లాడి, వారి ఫిర్యాదుల యొక్క సారాంశం తెలుసుకొని, వాటిని చట్టపరంగా త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అదే విధంగా అందిన ఫిర్యాదుల వివరాలను సంబందిత పోలీస్ స్టేషన్ అధికారులకు తెలియజేసి, త్వరితగతిన చట్ట ప్రకారం విచారణ జరిపి భాదితులకు న్యాయం అందించేలా చూడాలన్నారు. అలాగే జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ప్రజలు తమ ఫిర్యాదులను సమీపంలోని పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్‌డివిజన్ కార్యాలయాల్లో కూడా అందజేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా సివిల్, భూ, ఆర్థిక తగాదాలు, చీటింగ్, అత్తరింటి వేదింపులు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, సింగరాయకొండ సీఐ వై శ్రీహరి, వివిపాలెం ఎస్ఐ ప్రేమ్ కుమార్, ప్యానెల్ అడ్వొకేట్ బి బాలాజీ సింగ్, సమస్యల పరిష్కార వేదిక ఎస్ఐ జనార్దన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

# సర్ సర్వే పై అవగాహన సదస్సు



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 8)

మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక భూ సమేత భావన్నారాయణ స్వామి దేవాలయం నందు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సంబశివరావు అదేశాల మేరకు మండల అధ్యక్ష, కార్యదర్శిలు పోద వీరయ్య, అజాద్, జిల్లా టీడీపీ కార్యదర్శి నక్కల రాఘవ, కస్టర్ ఇంచార్జ్ లు బత్తుల శ్రీనివాసరావు, ఆశోది సుబ్బారెడ్డి ఆద్వర్యంలో రాబోయే రోజుల్లో అత్యంత కీలకమైన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే ప్రక్రియ పై మండల స్థాయి విస్తృత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సర్వేలో అనుసరించాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయిలో చేపట్టవలసిన చర్యలపై నాయకులకు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సుకు మండల స్థాయి ప్రజా ప్రతినిధులు, క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇంచార్జీలు, కో ఇన్‌ఛార్జిలు, క్రియాశీలక కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇంచార్జీలు, కో ఇన్‌ఛార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 8)

జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారా నికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యలను త్వరిత గతిన పరిష్క రించే దిశగా అధికారులు పనిచేయాలని చెప్పారు. మార్కాపురం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించి న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నూరు శాతం పరిష్కరించాలని చెప్పారు. నాలుగు వారంలో నిర్వ హించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను మరో వారం రోజుల్లో పరిష్కరించాలని ఆమె అధికారులకు చెప్పారు. పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమంలో రెవెన్యూ అంశాలకు సంబంధించి 161 అర్జీలు ఇతర శాఖలకు సంబంధించి 82 అర్జీలు వచ్చాయని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో మార్కాపు రం నియోజకవర్గ స్థాయి లోనాలుగు వారాల పాటు నాలుగు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్ర మాల ను నిర్వహించడం జరిగిందన్నారు. త్వరలో ఎర్రగొండ పాలెం నియోజకవర్గ స్థాయిలో ఒక నెలలో 4 వారాల పాటు 4 ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి శివరామిరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మనీష్, జిల్లా పంచాయతీ అధికారి బాలు నాయక్, విద్యుత్ శాఖ ఎస్ఈ అబ్దుల్ కరీం, గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ మోహన్‌రావు, జిల్లా రవాణాశాఖ అధికారి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు

# ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జూన్ 8)

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించి, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిన చంద్రబాబు నాయుడు రెండేళ్ల పాలనపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" అనే నినాదంతో సోమవారం స్థానిక అంబేద్కర్ ఆడిటోరియంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యర్రగొండపాలెం ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్, నియోజకవర్గ పరిశీలకులు పిడతల ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

**ప్రజలను వంచించిన కూటమి ప్రభుత్వం :**



ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ అధికారం కోసం ఎన్నికల వేళ సాధ్యంకాని అబద్ధపు హామీలను గుప్పించి, తీరా అధికారంలోకి వచ్చాక ప్రజలను చంద్రబాబు తీవ్రంగా వంచించారని మండిపడ్డారు. ఈ రెండేళ్ల పాలనలో నిరుద్యోగులకు, రైతులకు, మహిళలకు జరిగిన మేలు ఏమీ లేదని, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేశారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన ఉంటూ, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని ఉధృతం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ వైసిపి ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.





# ప్రభుత్వం వీఆర్ఓ లపై పని భారం తగ్గించాలి



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 8)

ప్రభుత్వం వీఆర్వోల పై పనిభారం తగ్గించాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణ లో భోజన విరామ సమయంలో వీఆర్వోలు నిరసన వ్యక్తం చేశారు. వివిధ రకాల పనులను ఒకే సారి చేయాలని లక్ష్యాలు నిర్దేశించడం వల్ల పనిభారం పెరిగి మానసికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. కర్నూలులో వీఆర్వో గా పనిచేస్తున్న మహమ్మద్ హుస్సేన్ పని ఒత్తిడి కారణంతో ఆత్మహత్య చేసుకోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. పనిచేయడానికి ప్రభుత్వ అధికారులుగా సిద్ధంగా ఉన్నామని, చేసే పనిలో ఒకదాని తరువాత మరొకటి చేయిస్తే బాగుంటుందని అభిప్రాయ పడ్డారు. రెగ్యులర్ గా ఉండే పనులతో పాటు అదనపు పనులు భారంగా మారాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోల సంఘం నాయకులు బాలవెంకటరెడ్డి, మాల్యాద్రి, సుబ్బారావు, అనిల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# సర్ కార్యక్రమం గురించి అవగాహన సమావేశం

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జూన్ 8)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో త్వరలో జరగనున్న సర్ కార్యక్రమం గురించి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మార్కాపురం పట్టణంలోని క్లస్టర్ 2, క్లస్టర్ 4 పరిధిలోని కొత్తగా నియమించిన సర్ ప్రోగ్రాం ఇన్చార్జిలు, బీఎల్‌వోలతో సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులలో గ్రామాల్లో హౌస్ మ్యాపింగ్ ఏ విధంగా చేయాలో, ఓటర్ వెరిఫికేషన్ ఏ రకంగా చేయాలో ఎమ్మెల్యే వారికి వివరించారు. అనంతరం మార్కెట్ యార్డ్ ఆవరణలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, వసంతలక్ష్మి వివాహ వార్షికోత్సవం సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన కేక్‌ను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కట్ చేశారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నాయకులు ఎమ్మెల్యేకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు తాళ్లపల్లి సత్యనారాయణ, కౌన్సిలర్ నాలి కొండయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.







# ఈ నెల 18, 19, 20న వైభవంగా జాంబవంత నగర్ కోదండ రామాలయం విగ్ర ప్రతిష్ట మహోత్సవం

## నాయకులు, దాతలకు ఆహ్వాన పత్రికలు అందజేసిన కమిటీ సభ్యులు

**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జూన్ 8)**

బద్వేల్ మున్సిపాలిటీ పరిధి జాంబవంత నగర్ కోదండ రామాలయం విగ్ర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం జూన్ 18, 19, 20వ తేదీల్లో మూడు రోజులపాటు వేద పండితులు సత్యనారాయణ శర్మ బృందం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించడం జరుగుతుంది. 15 సంవత్సరాల క్రితం ఆగిపోయిన కోదండ రామాలయం పునః నిర్మాణం పలువురు దాతల సహాయ సహకారాలతో దాదాపు 15,00,000 వ్యయంతో కోదండ రామాలయం పుణ నిర్మాణం, విగ్ర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా కనుల పండగ నిర్వహించేందుకు అభివృద్ధి కమిటీ సభ్యులు ముందస్తుగా అన్ని రకాల ఏర్పాట్లను చేపట్టడం జరిగింది. సోమవారం బద్వేల్ టిడిపి ఇన్చార్జ్ రితేష్ రెడ్డి, కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి, టిడిపి మున్సిపల్ అధ్యక్షులు గుర్రంపాటి వెంగళ్రెడ్డి,



సీనియర్ నాయకులు కనుమల్లపూటి ప్రసాద్, సింగం పల్లె శివయ్య స్వామి, మల్లికార్జున రెడ్డి సాంబశివారెడ్డి, సీనియర్ అడ్వకేట్ పీవీఎన్ ప్రసాద్, స్టేట్ డైరెక్టర్ కెవి సుబ్బారావు, తుమ్మలపెంట సురేష్ బాబు, సముద్రాల రాధాకృష్ణమూర్తి, మానవతా అధ్యక్షులు నాగిరెడ్డి శంకర్ రెడ్డి, సంగ్రె శ్రీనివాసులు యాదవ్, కామిరెడ్డి సుధాకర్ రెడ్డి, వంకెల పెద్ద పోలిరెడ్డి, ఈగ యద్దారెడ్డి, అర్బన్ సీఐ రామకృష్ణ, ఎస్సై కొండారెడ్డి మరియు ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్ పల్లె సుబ్బారెడ్డి, ఆరవ శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గోపాలస్వామి, లక్ష్మీ విద్యారణ్య, పాఠశాల కరస్పాండెంట్ శంకర్‌రెడ్డి, ఆలయ అభివృద్ధికి సహకరించిన పలువురు దాతలకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వల్లంకొండు వెంకటరమణ, కెవి సుబ్బారావు, పెద్ది సుధాకర్, కాలువ నాగేంద్ర, హరితో పాటు పలువురు కమిటీ సభ్యులు స్వామివారి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేసి పలువురికి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, దాతలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.







# మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహణ





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 8)**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం మండల పరిషత్తు కార్యాలయ ప్రాంగణమునందు మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించడం అయినది. నేటి నుండి 21వ తేదీ వరకు చేపట్టవలసిన షెడ్యూల్ ప్రకారం రోజు వారి కార్యక్రమాలు గురించి 0–18 సంవత్సరాలు, 18 సంవత్సరాలు పైబడిన వారిని 2 కేటగిరీలుగా చేసి వారికి యోగ ప్రాముఖ్యత అంశాల గురించి కాంపిటీషన్స్ నిర్వహించుటకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి సురేష్, మండల తహసిల్దార్ రవి శంకర్, ఎంఈఓ ఎంవి రమణయ్య, డిప్యూటీ ఎంపీడీవో సిహెచ్ శ్రీనివాసులు, సచివాలయ డిప్యూటీ ఎంపీడీవో ఎన్ జగదీష్ బాబు, వివిధ పాఠశాలల పిఈటిలు, పంచాయతీ అభివృద్ధి అధికారులు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపిఓ షేక్ అబ్దుల్లా, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి నేడు దళిత క్రైస్తవుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ





**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 8)**

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని, షెడ్యూల్డ్ కులాల మత స్వాతంత్ర హక్కును హరించివేస్తున్న 1950 రాష్ట్రపతి ఉత్తర్వు లోని పేరా 3 ని తొలగించాలని, క్రైస్తవులపై, చర్చిలపై, పాస్టర్ల పై జరుగుతున్న దాడులను అరికట్టి రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ పొదిలిలో దళిత క్రైస్తవుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన భారీ శాంతియుత ర్యాలీ ఏర్పాటు చేస్తున్నట్లు దళిత క్రైస్తవుల ఐక్య వేదిక పెద్దలు విలేకరుల సమావేశంలో తెలిపారు. 9వ తేదీన ఉదయం 9 గంటల నుండి స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నుండి ర్యాలీ ప్రారంభించబడి, తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం తహసీల్దార్ కి మెమోరాండం అందించడం జరుగుతుందన్నారు. ఈ ర్యాలీలో పొదిలి పరిసర ప్రాంతం క్రైస్తవులు భారీ సంఖ్యలో పాల్గొంటారని అన్నారు. దళిత క్రైస్తవులంతా ఏకమై ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# నవచేతన్న యాప్ గురించి శిక్షణ

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 8)**

నవచేతన్న యాప్ గురించి మన ఉలవపాడు మండలంలోనీ ప్రభుత్వ హైస్కూల్లో సోమవారం అంగన్వాడి కార్యకర్తలు అందరికి కూడా ట్రైనింగ్ ఇవ్వడం అయినది. తర్వాత ఇందులో భాగంగా పిల్లలకి నవ చేతన్ యాప్ డిసీజెస్ ఏ రకంగా డిసీస్ కనుగొంటాము, పిల్లల్లో యాప్‌లో ఏ విధంగా ఎక్కిస్తామో అనేది ముఖ్యమైనది. ఇది ఒక కొత్త యాప్ గా వస్తుంది. అంగన్వాడి కార్యకర్తలకి మొబైల్లో ఈ యాప్‌లో ఏ విధంగా చేయాలి, యాప్‌ని అసలు ఎలా డిజైన్ చేశారు. ఎలా చేయాలి. చైల్డ్ పేర్లు ఎలా ఎక్కించాలి? డిసీజెస్ ఉన్న వాళ్ళని డాక్టర్‌కి ఎలా రెఫర్ చేయాలి, ఇటువంటి అన్ని కూడా ఈ ట్రైనింగ్‌లో అంగనవాడి కార్యకర్తలకి నేర్పించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా సిడిపిఓ డి మాధవి లత 1000 డేస్ గురించి తర్వాత వాళ్ళ మెదడు డెవలప్మెంట్ గురించి అవన్నీ చెప్పారు. దాన్లో సూపర్వైజర్ నవచేతన అసల మొబైల్ యాప్ ఎలా వస్తది? ఎలా చేయాలి ప్లస్ 4 నివారణలు ఎలా చెప్పాలి, ఎవరికి చెప్పాలి తర్వాత వాళ్ళకి విటమిన్స్ గురించి, డెఫిషియన్సీ ఎలా వస్తే, ఎటువంటి ఆహారం తీసుకుంటే, ఎలా నివారించాలో కూడా అన్నీ కూడా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ అందరు కూడా హాజరయ్యారు.






# పెండింగ్ ఎంసిపిల పై జిల్లా స్థాయి వర్క్‌షాప్



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జూన్ 8)**

మార్కాపురం జిల్లాలోని డిఆర్డిఏ, వెలుగు ఆధ్వర్యంలో బ్యాంకర్లకు, వెలుగు సిబ్బందికి యాన్యువల్ క్రెడిట్ లైవ్లీ వుడ్ ప్లాన్‌లో భాగంగా బ్యాంకు లింకేజీకి సంబంధించి పెండింగ్ ఎంసిపిల పై సోమవారం జిల్లాస్థాయి వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్ కు ప్రాజెక్ట్ డైరెక్టర్ శివన్నారాయణ, యూపీఐ డీజీఎం రవికుమార్, ఏపీజీబీఆర్ఎం వెంకటేశ్వర్లు, ఎస్బిఐ చీఫ్ మేనేజర్ రామకృష్ణ, కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ గౌరీ, బ్యాంకు మేనేజర్, వెలుగు ఏపీఎంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడుతూ 6000 ఎంసిపిలు అప్రూవల్ ఇవ్వడం జరిగిందన్నారు. వాటికి సంబంధించి బ్యాంకు మంజూరు, డిస్పాచ్మెంట్ చాలా పెండింగ్ ఉందన్నారు. కావున త్వరగా శాంక్షన్ ఇవ్వవలసిందిగా మేనేజర్లకు తెలియజేశారు. అదే విధంగా వివిధ జీవనోపాదులు ఏర్పాటు చేసుకొనుటకు బ్యాంకర్లు సహకరించాలని కోరారు. దీనికి స్పందిస్తూ బ్యాంకుకి ఉన్నతాధికారులు కచ్చితంగా సహకరిస్తామని తెలియజేశారు. అదే విధంగా బ్యాంకు మేనేజర్లు కొన్ని సమస్యలు వారి దృష్టికి తీసుకురావడం జరిగింది. వాటిని పరిశీలిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.

# ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా కంభం చెరువు కట్టపై ఘనంగా యోగా మహోత్సవం

**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూన్ 8)**



గిద్దలూరు నియోజకవర్గ ప్రజల ఆరోగ్యం, ఆనందం, ఆత్మవిశ్వాసం, సమగ్ర శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని, ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 2026 యోగాంధ్ర కార్యక్రమంను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలియజేయడం సంతోషకరం. "యోగ ఫర్ వన్ ఎర్త్–వన్ హెల్త్" అనే మహోన్నత సందేశాన్ని ప్రజల హృదయాల్లో నింపే ఈ కార్యక్రమంలో, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత, విద్యార్థులు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి హృదయపూర్వకంగా పిలుపునిచ్చారు. కంభం చెరువుకట్ట పై నిర్వహించనున్న ఈ యోగా కార్యక్రమం ద్వారా శరీరానికి ఆరోగ్యం, మనసుకు ప్రశాంతత, జీవితానికి శక్తి, సమాజానికి స్ఫూర్తి లభిస్తుందని పేర్కొన్నారు. యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, అది ఆరోగ్యవంతమైన, సానుకూలమైన, సమతుల్యమైన జీవితానికి మార్గదర్శకమని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో నిర్వహించబడుతున్న ఈ మహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొని, యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని కోరారు.

# మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవిని కలిసిన కాటూరి పవన్ కళ్యాణ్



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 8)**

మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవిని తన నివాసం వద్ద సోమవారం పొదిలి మండల ఐటిడిపి జనరల్ సెక్రటరి కాటూరి పవన్ కళ్యాణ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com